### పుట్టబోయే పిల్లల ఆరోగ్యం కోసం

# పౌష్టికాహారం తీసుకోవాలి

### --జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం ఏప్రిల్ 21 ప్రభాతవార్త** ఎనిమిదవ పోషణ పక్వాడ -- 2026 కార్యక్రమంలో భాగంగా పాలకోడేరు మండలం విస్సాకోడేరు కళ్యాణ మండపంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, పుట్టబోయే పిల్లల శారీరక మానసిక అభివృద్ధికి గర్భిణీ స్త్రీలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. గర్భిణీలు బాలింతలు సరైన పోషకాహారం తీసుకోవడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని పేర్కొన్నారు. పోషకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతమైన, తెలివైన పిల్లలు జన్మిస్తారని, తద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని అన్నారు. గర్భిణీలు సానుకూల ఆలోచనలు పెంపొందించుకోవాలని, మంచి సంగీతం వినడం, పుస్తకాలు చదవడం, యోగా, ధ్యానం వంటి వాటికి సమయం కేటాయించడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని సూచించారు. అలాగే చిన్నారులు పెద్దలతో సమయం గడపడం ద్వారా కుటుంబ విలువలు, సంప్రదాయాలు అలవర్చుకుంటారని తెలిపారు. కథలు వినడం, అనుభవాలను పంచుకోవడం ద్వారా పిల్లల మానసిక అభివృద్ధి మెరుగుపడుతుందని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలతో సమయం గడపాలని, వారికి ఇంటి వాతావరణంలో ప్రేమతో కూడిన మార్గదర్శనం ఇవ్వాలని సూచించారు. సాంప్రదాయ ఆహారపు అలవాట్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, ఫాస్ట్ ఫుడ్ జంక్ ఫుడ్ వినియోగం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని హెచ్చరించారు. పిల్లలకు వీలైనంత వరకు ఇంట్లో తయారుచేసిన ఆహారాన్ని అందించాలని, అలాగే చిన్నారులను సెల్ ఫోన్ వినియోగానికి దూరంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి డి.శ్రీలక్ష్మి, సీడీపీవో విజయరత్నం, సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పరిపాలన యంత్రాంగానికి వెన్నుముక పౌరసేవలు



**భీమవరం ఏప్రిల్ 21 ప్రభాతవార్త** ప్రజాస్వామ్యంలో పాలన, విధాన రూపకల్పన అమలుతోపాటు దేశాన్ని పురోగతి అభివృద్ధి వైపు నడిపించడంలో పౌరసేవలు ముఖ్యపాత్ర పోషిస్తాయని యూత్ హాస్టల్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మట్లపూడి సత్యనారాయణ అన్నారు. అరసవల్లి చారిటబుల్ ట్రస్ట్, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ పౌర సేవల దినోత్సవాన్ని నిర్వహించారు. సత్యనారాయణ మాట్లాడుతూ పౌరసేవలు పరిపాలన యంత్రాంగానికి వెన్నుముక అని అన్నారు. శ్రీమావుళ్ళమ్మ దేవస్థానం ట్రస్ట్ సభ్యులు, అరసవల్లి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు అరసవల్లి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దేశ సమగ్రతను కాపాడుతూ సామాన్యుడి అభ్యున్నతికి బాటలు వేసే పౌర సేవలు కేవలం అధికారులకు మాత్రమే కాదని, నవభారత నిర్మాణంలో కీలక భాగస్వామ్యమని అన్నారు. కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ దేశ ఐక్యతను స్థిరత్వాన్ని కాపాడటంలో బ్యూరోక్రసీ పాత్ర ఎంతో కీలకమని అన్నారు. సివిల్ సర్వీసెస్‌లో వివిధ స్థాయిలు, డిపార్ట్‌మెంట్‌లలో పని చేస్తున్న వారందరిని స్మరించుకోవడానికి జాతీయ పౌర సేవల దినోత్సవం అంకితం చేయబడిందన్నారు . కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు డా ఎస్ సత్యనారాయణ రాజు, ఎన్ ఎస్ ఎస్ ఆఫీసర్లు కె మార్కాండ, చిడే రామదాసు, వినోద్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంటర్ ప్రతిభావంతులకు ఎంపీ పాక అభినందనలు



**భీమవరం ఏప్రిల్ 21 ప్రభాతవార్త** పట్టణం విద్యాకేంద్రంగా ఉండటానికి విద్యార్థులు సాధిస్తున్న ప్రతిభ అని చెప్పడంలో అతిశయుక్త లేదని, విద్య దొంగలించలేని సొత్తు అని రాజ్యసభ సభ్యులు పాక సత్యనారాయణ అన్నారు. ఎంపీ కార్యాలయంలో మంగళవారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఇటీవలే విదులైన ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఆదిత్య జూనియర్ కళాశాల విద్యార్థులను ఎంపీ సత్యనారాయణ అభినందించి మాట్లాడారు. ఒక్కప్పుడు విద్య పట్ల ఆసక్తి కనబర్చే వారు కాదని, నవీన యుగంలో అన్ని వర్గాల వారు విద్యలో పోటీతత్వంలో ఉంటున్నారన్నారు. భీమవరం ఆదిత్య జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంక్ సాధించడం గొప్ప విశేషమన్నారు. కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ భీమవరం ఆదిత్య జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానం విద్యార్థులు 990,467 మార్కులు సాధించడం హర్షించదగ్గ విషయమన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరచడం మన భీమవరం పట్టణానికే గర్వకారణమన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించి సర్టిఫికెట్స్, మెడల్స్ అందించారు. కార్యక్రమంలో కోమటి రవి కుమార్, డైరెక్టర్ శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## భారతీయ జ్ఞాన వ్యవస్థ సంప్రదాయాలకు ప్రతీక



**భీమవరం ఏప్రిల్ 21ప్రభాతవార్త** భారతీయ జ్ఞాన వ్యవస్థ వేల సంవత్సరాలుగా భారత దేశంలో అభివృద్ధి చెందిన గొప్ప మేధో సంప్రదాయాలను సూచిస్తుందని ,ఇది శాస్త్రం, గణితం, వైద్యం, వ్యవసాయం, తత్వశాస్త్రం ,కళలు, వ్యవసాయం, పర్యావరణం వంటి విభిన్న రంగాలలో జ్ఞానాన్ని కలిగిస్తుందని భీమవరం ఎస్ ఆర్ కే ఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం జగపతి రాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కె వి మురళీకృష్ణంరాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్లేస్మెంట్ సెల్ అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్ సీతారామరాజు పేర్కొన్నారు. భీమవరం పట్టణానికి చెందిన జె ఎల్ బి పాఠశాల విద్యార్థిని విద్యార్థులు కళాశాలలో గల సృజన వాటికను సందర్శించారు. సృజన వాటికలో పురాతన కాలం నాటి రకరకాల వస్తువులను పరిశీలించి ఆశ్చర్య చకుతులయ్యారు. సుదీర్ఘకాలం వాటిని భద్రపరిచి ఆ కళాఖండాలను విద్యార్థులకు చూపించే విధంగా ఏర్పాటు చేసిన కళాశాల యాజమాన్యానికి జేఎల్బి పాఠశాల సూపర్వైజర్ ఓ గౌతమి కృతజ్ఞతలు తెలియజేశారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్ కృష్ణ చైతన్య అసిస్టెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ కే ఎన్ వి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అన్నసమారాధనలో రఘురామ్ నాయుడు



**తాడేపల్లిగూడెం ఏప్రియల్ 21 (ప్రభాత వార్త )** మండలం ఆరుగొలను గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైస్సార్సీపీ ఇంచార్జ్ వడ్డి రఘురామ్ నాయుడు పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ప్రభుత్వ విప్ మరియు నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ నరసాపురంలో శ్రీ ఆంజనేయ స్వామివారి సన్నిధిలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ప్రత్యేక పూజా కార్యక్రమములు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు వీర మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకుని మరింత శక్తితో ప్రజాసేవలో కొనసాగాలని ప్రార్థనలు చేశారు. ప్రజల ఆశీస్సులు, భగవంతుని కృపతో ఆయన త్వరగా ఆరోగ్యంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు.

**ప్రభాతవార్త నరసాపురం**

# అందరికీ సమాన హక్కులు కల్పించాలి



**భీమవరం టౌన్, ఏప్రిల్ 21 : ప్రభాతవార్త** దళితులకు మత స్వేచ్ఛ హక్కు కల్పిం చాలని, వివక్షాపూరిత 1950 ప్రెసిడెన్షియల్ ఆర్డర్ 3 వ పేరా తొలగించాలని, రాజ్యాం గంలోని 14,15 అధికరణల ప్రకారం మతం తో సంబంధం లేకుండ అందరికి సమాన హక్కులు కల్పించాలని రౌండ్ టేబుల్ సమా వేశం డిమాండ్ చేసింది. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా పునరుద్ధరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అధ్యక్షతన మంగళవారం భీమవరం అంబేద్కర్ భవన్ లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అధ్యక్షత వహించిన సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ భారత రాజ్యాం గం కులవివక్షను రూపుమాపాలని సూచి స్తుందని, కానీ దురదృష్టవశాత్తు ఒక దళితుడు తన మతాన్ని మార్చుకున్నంత మాత్రాన అతని సామాజిక స్థితిగతులు, అతను ఎదుర్కొంటున్న కులవివక్ష, అంటరానితనం, మారిపోవని మత ప్రాతిపదికన ఎస్సీ హోదాను నిరాకరించడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. హిందూ, సిక్కు, బౌద్ధ మతాల్లోని దళితులకు లభిస్తున్న ఫలాలు క్రైస్తవ దళితులకు ఎందుకు నిరాకరిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. జ్ఞానీ మిశ్రా కమిషన్ నివేదిక, రంగనాథ్ మిశ్రా కమిషన్ సిపార్సులను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా అధ్యక్షుడు లంకా కృష్ణమూర్తి మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలనే ఉద్యమం జాతీయ స్థాయిలో జరగాలని తమ పార్టీ మద్దతు ఇస్తుందన్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అంకెం సీతారామ్ మాట్లాడుతూ దళితులు, దళిత క్రైస్తవులు మొదటి నుంచి అస్పృశ్యత,అంటరానితనం వివక్షతకు గురవుతున్నారని తమ పార్టీ ఈ పోరాటంలో భాగం పంచుకుంటుందన్నారు. దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్య క్షుడు కళింగ లక్ష్మణరావు, కులవివక్షత పో రాట సమితి జిల్లా అధ్యక్షుడు కె. క్రాంతికు మార్ మాట్లాడుతూ మతం మారినంత మాత్రాన దళితుల్లోని అంటరానితనం, అస్పృశ్యత, వివక్షత పోవని మనుధర్మ శాస్త్రంలో దళితులు పంచములేనని అన్నారు. దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు తన తీర్పును ఉపసంహరించుకోవాలని, మోడీ పరివారం కనుసన్నల్లోనే తీర్పు వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 1950 రాష్ట్రపతి ఉత్తర్వులు పేరా 3 రద్దుకోసం సంఘటిత ఉద్యమాలు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు మణి కుమార్, సిహెచ్ శుభాకర్, నెల్సన్ రాజు, రేమల్లి కమలరాజు, కత్తుల ప్రకాష్, చిరంజీవి, తిమోతి, న్యాయవాదులు డి.కె.వి.ప్రకాష్, రాజబాబు, ఛాన్ భాషా తదితరులు మాట్లాడారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, సికిలే పుష్పకుమారి తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడితే పదవులు వస్తాయని చెప్పడానికి నిదర్శనం నరసింహారావు

### రాష్ట్ర గౌడ సంఘ అధ్యక్షులు పోసిన చెంచు రామారావు



**మండవల్లి,ఏప్రిల్ 22(ప్రభాతవార్త)** కష్టపడితే పార్టీలో పదవులు వస్తాయని చెప్పడానికి కైకలూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు నిదర్శనం అని రాష్ట్ర గౌడ సంఘ అధ్యక్షులు పోసిన చెంచు రామారావు అన్నారు. ఇటీవల వీరమల్లు నరసింహారావుకి రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా మంగళవారం లోకుమూడి దత్తాశ్రమం నందు కైకలూరు నియోజకవర్గ గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షులు పోలగాని నాగరాజు ఆధ్వర్యంలో సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షులు పోసిన చెంచు రామారావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈసందర్భంగా అధ్యక్షులు రామారావు మాట్లాడుతూ టీడీపీ రాష్ట్ర స్థాయిలో వీరమల్లు నరసింహారావుకి పదవి ఇవ్వడం అభినందనీయం అన్నారు. నియోజకవర్గంలో ఉన్న టిడిపి నాయకులకు, కార్యకర్తలకు మంచి పదవులు వచ్చేలా నరసింహారావు కృషి చేయాలని కోరారు.కష్టపడితే పార్టీలో పదవులు వస్తాయని చెప్పడానికి నరసింహారావు నిదర్శనం అన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షులు పోసిన చెంచు రామారావును కైకలూరు నియోజకవర్గ గౌడ సంఘీయులు ఘన సత్కారం చేశారు. అదేవిధంగా నరసింహారావుతోపాటు టిడిపిలో ఇటీవల నూతనంగా పదవులు పొందిన ఏలూరు జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు పోసిన పాండురంగారావు,కైకలూరు మండల పార్టీ అధ్యక్షులు పంది రాధాకృష్ణ,కైకలూరు టౌన్ అధ్యక్షులు పదమట వాసు, మండవల్లి సొసైటీ బ్యాంక్ చైర్మన్ మారగాని మురళీ కృష్ణ, ముదినేపల్లి డిసి చైర్మన్ నారగాని కొండ,కానుకొల్లు సొసైటీ బ్యాంక్ చైర్మన్ కోసూరి మాణిక్యలరావు, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం కమిటీ సభ్యులు రాజులపాటి పాండురంగారావులకు సత్కారం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ సంఘం నాయకులు పరసా ఏడుకొండలు,పోసిన పాపారావు గౌడ్,కైకలూరు మండల అధ్యక్షులు కట్టా నాగబాబు, మేకా విజయ్, తదితరులు పాల్గొన్నారు.

# సత్యవరంలో ధాన్య కొనుగోలు కేంద్రం ప్రారంభం



**పెనుమంట్ర, ఏప్రిల్ 21, (ప్రభాతవార్త)** మండలంలోని సత్యవరం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక సొసైటీ చైర్ పర్సన్ మైగాపుల రాము మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరూ దాన్ని కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ధాన్యం అమ్మకాలలో దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా అమ్ముకోవచ్చు అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి 24 గంటల్లో ప్రభుత్వం సంబంధిత రైతు ఖాతాలో నగదు జమా చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కొయ్యేటిపాడు సొసైటీ అధ్యక్షులు భోగేశ్వరావు, సత్తి ఆది రెడ్డి, వెంకట్ రెడ్డి గారు, భామి రెడ్డి, గొల్లపల్లి శ్రీను, వేణు, శేషు బాబు, మిరియాల శివ తదితరులు పాల్గొన్నారు.

# పాలకొల్లులో రూ.5 కోట్లతో ఆధునిక చెత్త ప్రాసెసింగ్ సెంటర్ ఏర్పాటు

### రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్



**పాలకొల్లు: ఏప్రిల్ 21 ప్రభాత వార్త** పాలకొల్లు పట్టణంలోని ఎడ్ల బజార్, సూరితేజ నగర్ ప్రాంతాల్లో కొనసాగుతున్న బయో మైనింగ్ పనులను రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు మరియు రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా లెగసీ వ్యర్థాల తొలగింపు పనులను సమీక్షించి మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్లకు తగిన సూచనలు ఇచ్చారు. మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ చెత్త నుంచి సంపద సృష్టించడం మాత్రమే కాకుండా ప్రజలు ఆరోగ్యంగా జీవించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాష్ట్రాన్ని "స్వచ్ఛ ఆంధ్ర -- ఆరోగ్య ఆంధ్ర"గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత ప్రభుత్వ కాలంలో భారీగా పేరుకుపోయిన చెత్తను శాస్త్రీయంగా ప్రాసెస్ చేసి పూర్తిగా తొలగించడమే తమ సంకల్పమని స్పష్టం చేశారు. పాలకొల్లులోని డంపింగ్ యార్డుల్లో కొండల్లా పేరుకుపోయిన చెత్తను తొలగించి, భవిష్యత్తులో తడి-పొడి చెత్త వేరు చేసి, వ్యర్థాలను వనరులుగా మార్చే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. పాలకొల్లు రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.5 కోట్లు మెట్రిక్ టన్నుల చెత్త గుర్తించగా, అందులో ఒక కోటి మెట్రిక్ టన్నులు ఇప్పటికే ప్రాసెస్ చేసినట్లు తెలిపారు. మిగిలిన వ్యర్థాలను త్వరితగతిన తొలగించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. పాలకొల్లులో ఇప్పటికే వేలాది టన్నుల చెత్తను క్లియర్ చేయగా, ప్రస్తుతం 57,600 మెట్రిక్ టన్నుల బయో మైనింగ్ పనులకు ఆర్డర్లు జారీ చేశామని చెప్పారు. అదనంగా డ్రోన్ సర్వే ద్వారా మిగిలిన వ్యర్థాల అంచనాలు తీసుకుని తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు. పాలకొల్లులో రూ.5 కోట్ల వ్యయంతో ఆధునిక వ్యర్థ ప్రాసెసింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, రాష్ట్రానికి ఆదర్శంగా నిలిపే దిశగా కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. డంపింగ్ యార్డులను సుందరీకరణ చేయడం కూడా ప్రణాళికలో భాగమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసాపురం ఆర్డీవో దాసిరాజు, మున్సిపల్ కమిషనర్ విజయ్ సారథి, ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదిశంకరాచార్య జయంతి వేడుకలు



**ఆగిరిపల్లి ఏప్రిల్ 21 ప్రభాతవార్త.** స్థానిక శ్రీ శోభనాచల లక్ష్మీ నరసింహ వేద శాస్త్ర పాఠశాలలో జగద్గురు ఆది శంకరాచార్య జయంతి వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చతుర్వేద పారాయణలు నిర్వహించారు. స్థానిక గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో జగద్గురు శంకరాచార్య వేడుకలు నిర్వహించారు. ముందుగా శంకరాచార్య పటమునకు పోలవరం వేసి అనంతరం ఆయన సనాతన ధర్మం కోసం ఆయన విశేష కృషి చేశారు అని వక్తలు అన్నారు. ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

## మహిళల సంరక్షణపై అవగాహన సదస్సు



**ఆగిరిపల్లి ఏప్రిల్ 21 ప్రభాతవా ర్త.** మండలంలోని సగ్గూరు గ్రామంలో మంగళవారం రాత్రి మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎస్సై కే. శుభ శేఖర్ మాట్లాడుతూ మహిళలు చట్టాలు గురించి పూర్తిగా అవగాహన చేసుకోవాలని, ఫోక్ సో చట్టం గురించి సైబర్ నేరాలు గురించి శక్తి యాప్ గురించి మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

## వైభవంగా బసవ జయంతి వేడుకలు



**నరసాపురం ఏప్రిల్ 21 ప్రభాతవార్త** నరసాపురం 18వ వార్డు వనవులమ్మ మహాలక్ష్మమ్మ అమ్మవార్ల గుడి ఆవరణలో బసవ జయంతి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దలు మాట్లాడుతూ పిల్లలకు బసవ జయంతి గురించి వివరించారు. తొలిత బసవ పటానికి పూలమాలవేసి భక్తి శ్రద్ధలతో పూజ నిర్వహించారు సాయంత్రం అఖండ అన్న సమారాధన చేశారు ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గుడిమెట్ల నాగలింగం సమతం చతుర్ముఖ బసవన్న సమతం వెంకటేశ్వరరావు సమతం బసవ కుమార్ సమతం చిన్న సమతం గణేష్ సమతం మల్లికార్జున సమతం శివప్రసాద్ ముంగండ శివ వాసా లితీష్ తదితరులు పాల్గొన్నారు

### ఆసుపత్రిలో గృహిణి ఆత్మహత్య - కేసులు వేధింపులే కారణమా?

**నరసాపురం ఏప్రిల్ 21 ప్రభాతవార్త** మండలంలోని పెదమైన వానిలంక గ్రామానికి చెందిన సంకరపు అరుంధతి 35, మంగళవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో మరుగుదొడ్డిలో ఉరితీసుకుని ఆత్మహత్య చేసుకున్నది. గ్రామంలో జరిగిన ఘర్షణ విషయంలో ఆమె గాయపడటంతో ఆసుపత్రిలో చేరారు. అక్రమంగా తన భార్యపై కేసులు పెట్టి పోలీసులు వేధించారని భర్త ఆరోపణ. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### ఆల్ ఇండియా ర్యాంకులతో తిరుమల విద్యార్థుల విజయాభేరి



**భీమవరం ఏప్రిల్ 21 ప్రభాతవార్త** భీమవరం తిరుమల విద్యార్థులవిజయభేరి కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించిన ప్రతిష్టాత్మకమైన జె.ఇ.ఇ. మెయిన్స్ 2026 పరీక్ష ఫలితాలలో భీమవరం తిరుమల విద్యాసంస్థల విద్యార్థులు అద్భుతమైన ఫలితాలను కనపరిచారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. జె.ఇ.ఇ. మెయిన్స్ను నిర్వహించిన ఎన్.టి. ఎ. ఫలితాలు విడుదల చేయగా, అందులో వివిధ విభాగాల నుండి ఆల్ ఇండియా 3వ ర్యాంకుతో బి. కౌషల్ ప్రథమ స్థానంలో నిలవగా, 17 వ ర్యాంకు- కె. జాస్మిత, 18 వ ర్యాంకు- బి. వెంకట రమణ, 112వ ర్యాంకు- జి. మోనిషా, 174 వ ర్యాంకు- సి. హెచ్. ధనుంజయ బాలాజి, 222 వ ర్యాంకు- పి. మోహిత్ కృష్ణ సాయి, 252 వ ర్యాంకు- ఐ. రోహిత్ కుమార్, 327వ ర్యాంకు- జి. రోషిత్, 474 వ ర్యాంకు- పి. రోషిత్, 638 వ ర్యాంకు- జె. హెచ్. లక్ష్మణ్ కుమార్, 674వ ర్యాంకు- ఎన్. కరుణ సాహితి, 744 వ ర్యాంకు- పి.నరసింహ వర్మ 844 వ ర్యాంకు సి.హెచ్. భాస్కర శ్రీ శేష సాత్విక్, 894 వ ర్యాంకు- ఆర్. జాహ్నవి, ఇలా అత్యుత్తమ ర్యాంకులు సాధించి, అల్ ఇండియా 500 ర్యాంకు లోపు సాధించిన వారు 9 మంది, 1000 లోపు 14 గురు, 2000 లోపు 1 9 మంది, 5000 లోపు 33 మంది, 10000 లోపు 63 మంది,20000 లోపు 107 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారని సంస్థ డైరక్టర్స్ జి. సతీష్ బాబు, ఎన్. సాయిరాజు,పి. శ్రీనివాస వర్మ తెలిపారు. సుమారు 125 మంది పైగా విద్యార్థులు కేవలం భీమవరం బ్రాంచ్ నుండే ఎన్.ఐ.టి,ఐ.ఐ.ఐ.టి. కళాశాలలో అడ్మిషన్లు సాధించగలరని తెలియచేస్తూ, ఈ ఫలితాలను సాధించిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అభినందనలు. సహకరించిన తల్లిదండ్రులకు, శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు తెలియచేసారు.

# నూతన క్రిమినల్ చట్టాలపై ప్రజలకు అవగాహన

## నూజివీడు డిఎస్పి ప్రసాద్



**నూజివీడు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** నూతన క్రిమినల్ చట్టాలపై నూజివీడు డి.ఎస్.పి కే వి వి ఎన్ వి ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎం.ఆర్ .అప్పారావు కాలనీ లో అవగాహన సదస్సు ను నిర్వహించారు. డీఎస్పీ ఆధ్వర్యంలో నూజివీడు టౌన్ సీఐ సత్య శ్రీనివాస్ ఇతర సిబ్బంది ప్రజలకు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. నూతన క్రిమినల్ చట్టాలు భారత ప్రభుత్వం తీసుకు వచ్చిన కొత్త చట్టాల గురించి ప్రజలు అవగాహన కలిగి ఉండటం ఎంతైనా అవసరం అని వివరించారు. బాధితులకు వేగంగా న్యాయం అందించడమే ఈ నూతన చట్టాల ప్రధాన ఉద్దేశ్యం.పౌర కేంద్రీకృత విధానం మునుపటి చట్టాల కంటే బాధితుల హక్కులకు రక్షణకు ఈ చట్టాల్లో అత్యధిక ప్రాధాన్యత ఇవ్వబడింది. ఎఫ్.ఐ.ఆర్ నమోదు నుండి కోర్టు విచారణ వరకు డిజిటల్ సాక్ష్యాలకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. ఆన్‌లైన్ మోసాలు అప్రమత్తత సైబర్ నేరగాళ్లు రకరకాల మార్గాల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.మీకు తెలియని వ్యక్తుల నుండి వచ్చే గిఫ్ట్ ఆఫర్లు, లాటరీ మెసేజ్‌లు లేదా బ్యాంక్ కేవైసీ అప్డేట్ కాల్స్‌ను అస్సలు నమ్మవద్దన్నారు. వాట్సాప్ లేదా ఎస్ఎంఎస్ ద్వారా వచ్చే అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దన్నారు. అలా చేయడం వల్ల మీ ఫోన్ హ్యాక్ అయ్యే ప్రమాదం ఉందని. బ్యాంక్ ఖాతాకు సంబంధించిన ఓటిపి నంబర్లను ఎవరికీ, ఏ సందర్భంలోనూ చెప్పకూడదన్నారు. ఒకవేళ మీరు లేదా మీకు తెలిసిన వారు సైబర్ మోసానికి గురైతే తక్షణమే ఈ క్రింది చర్యలు చేపట్టాలన్నారు. సైబర్ హెల్ప్ లైన్ వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు నమోదు చేయండి. నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్ www.cybercrime.gov.in ద్వారా మీ ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయవచ్చు. మోసం జరిగిన మొదటి గంటలోనే ఫిర్యాదు చేస్తే, మీ ఖాతా నుండి పోయిన డబ్బును రికవరీ చేసే అవకాశం ఎక్కువగా ఉంటుంది.పోలీసుల సూచ నలు కాలనీ లో ఏవైనా అపరిచిత వ్యక్తులు తిరుగుతున్నా లేదా అసాంఘిక కార్య కలాపాలు గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి.అత్యవసర పరిస్థితుల్లో 112 నెంబర్ కు సంప్రదించండి. అవగాహనే అపరాధాలకు అడ్డుకట్ట. ప్రజల భాగస్వామ్యంతోనే నేర రహిత సమాజాన్ని నిర్మించడం సాధ్యమని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పశ్చిమగోదావరి,ఏలూరు వార్త



# పర్యాటక కేంద్రంగా నరసాపురాన్ని మార్చేందుకు కృషి

## కోరంగిని సందర్శించిన ఎమ్మెల్యే బృందం

**నరసాపురం ఏప్రిల్ 21 ప్రభాతవార్త**
నరసాపురం నియోజకవర్గాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వ విప్ మరియు నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మంగళవారం కాకినాడ జిల్లాలోని కోరంగి వైల్డ్‌లైఫ్ సాంక్చువరీని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రత్యేకమైన మడ అడవుల నిర్మాణం, జీవ వైవిధ్యం, పర్యాటక నిర్వహణ విధానాలను సమగ్రంగా పరిశీలించారు. అలాగే స్థానిక మత్స్యకారులతో మరియు అటవీ శాఖ అధికారులతో సమావేశమై, పర్యాటక అభివృద్ధి ద్వారా కలిగే అవకాశాలు, సవాళ్లు, ఆదాయ వనరులపై వివరాలు తెలుసుకున్నారు. కోరంగి ప్రాంతంలో అమలవుతున్న పర్యాటక నమూనాలను అధ్యయనం చేసి, నరసాపురంలో కూడా వాటిని అమలు చేయగల మార్గాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ, నరసాపురం మండలంలోని దర్బరేవు ప్రాంతంలో ఉన్న మడ అడవులను కోరంగి తరహాలో అభివృద్ధి చేసి, రాష్ట్రంలోనే ఒక ముఖ్యమైన ఎకో–టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ప్రకృతి సౌందర్యాన్ని కాపాడుతూ, పర్యావరణానికి హాని కలగకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టి, బోటింగ్, గైడింగ్, హోం స్టేలు వంటి పర్యాటక సంబంధిత రంగాలలో అవకాశాలు సృష్టించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో నరసాపురాన్ని పర్యాటక పటంలో ప్రముఖ స్థానం కలిగించే దిశగా కృషి కొనసాగుతుందని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ వెల్లడించారు ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు వారితో పాటు నరసాపురం నియోజకవర్గ



తెలుగుదేశం పార్టీ ఇంచార్జి పొత్తూరి రామరాజు, రాష్ట్ర మత్స్యశాఖ అభివృద్ధి చైర్మన్ కొల్లు పెద్దిరాజు, ఉమ్మడి జిల్లా డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఉప చైర్మన్ గుబ్బల మార్రాజు, వలవల నాని, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొప్పాడి రవీంద్రనాథ్ ఠాగూర్, ఏఎంసి వైస్ చైర్మన్ దేశినీడి గంగాధర్, వాతాడి కనకరాజు మరియు జనసేన, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

# త్వరలో చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ప్రారంభం

## ఏలూరు ఎం.పీ మహేష్ కుమార్ యాదవ్



**నూజివీడు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు మరికొన్ని రోజుల్లో ప్రారంభం కాబోతున్నాయని ఏలూరు ఎం.పీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన నూజివీడులో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని అనుమతులు వచ్చాయని , మరొక అనుమతి లేఖ కోసం చూస్తున్నామన్నారు. పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తయ్యే నాటికి చింతలపూడి ప్రాజెక్ట్ పనులు కూడా పూర్తి చేయాలన్నదే సీ.ఎం చంద్రబాబు నాయుడు ఆకాంక్ష అన్నారు. పోలవరం ప్రాజెక్టు పనులు ప్రారంభించేందుకు అన్ని చర్యలు ప్రభుత్వం తీసుకుంటుంది.పామాయిల్ సాగును కేంద్ర ప్రభుత్వం ఏవియేషన్ ఫీల్డ్ లో కలిపేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తి అయితే మెట్ట ప్రాంతమైన నూజివీడు, చింతలపూడి, తిరువూరు నియోజకవర్గాల పరిధిలో ఉన్న ఆయకట్టు భూములకు సాగునీరు అందుతుందన్నారు. ఈ ప్రాంతంలో భూగర్భ జలాల నీటిమట్టం కూడా పెరుగుతుంది అన్నారు. ఈ ప్రాంత రైతులకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. వాణిజ్య పంటలు సాగు చేసేందుకు పామాయిల్ కు రానున్న రోజుల్లో మంచి గిట్టుబాటు ధర లభించే అవకాశం నూజివీడు ప్రాంతంలో రైతులందరూ పామాయిల్ సాగు వైపు మొగ్గు చూపాలి.మెట్ట ప్రాంతాల్లో పొగాకు పండిస్తున్న, ఇతర పంటలు పండించే రైతులకు కూడా పామాయిల్ సాగు చెయ్యడం వల్ల రూ. 50 వేలు వరకు గిట్టుబాటు ధర వస్తుంది.భవిష్యత్ లో హైదరాబాద్ లో కంటే మన ప్రాంతంలో భూముల ధరలు పెరగనున్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి తలపంటి రాజశేఖర్, ముసునూరు మండల టిడిపి అధ్యక్షులు గద్దె రఘు, దాసరి స్వామి, ఇతర నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఆవిష్కరణలలో సివిల్ సర్వెంట్ల పాత్ర కీలకం

## --జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం ఏప్రిల్ 21 ప్రభాతవార్త**
దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఏప్రిల్ 21న నిర్వహించే నేషనల్ సివిల్ సర్వీసెస్ డే సందర్భంగా భీమవరం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, గత రెండు సంవత్సరాలుగా అధికారులు ఒక లక్ష్యంతో కట్టుబడి పనిచేస్తున్న తీరు అభినందనీయమని, ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రజాసేవలో నిబద్ధత, పారదర్శకత, సమర్థత మరియు ప్రజల పట్ల అంకితభావం వంటి విలువలను మరింత బలపరచడానికి ఈ రోజు ఒక స్ఫూర్తిదాయక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. దేశ అభివృద్ధి, సమగ్ర సంక్షేమం మరియు సుస్థిర పురోగతిలో సివిల్ సర్వీసుల పాత్ర అపూర్వమని తెలిపారు. సివిల్ సర్వెంట్లు తీసుకునే నిర్ణయాలు, అమలు చేసే పథకాలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలకమని చెప్పారు. ముఖ్యంగా గ్రామీణాభివృద్ధి, ఆరోగ్యం, విద్య మరియు డిజిటల్ పరిపాలన రంగాల్లో వారు చూపుతున్న కృషి ప్రశంసనీయమని కొనియాడారు. ప్రజల సంక్షేమం కోసం పరిపాలనలో నూతన ఆవిష్కరణలను ప్రవేశపెట్టి సమగ్ర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో సివిల్ సర్వెంట్లు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజాసేవలో ఉన్నత ప్రమాణాలు, పారదర్శకత, సమర్థత మరియు నిబద్ధతను ప్రోత్సహించేందుకు ఈ రోజు ఒక ముఖ్య సందర్భంగా నిలుస్తుందని అన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, భవిష్యత్తులో కూడా అధికారులు ప్రజల ఆశలు నెరవేర్చే విధంగా మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ప్రజలకు మర్యాదపూర్వకంగా, నాణ్యమైన సేవలు అందించడం ప్రతి అధికారికి ముఖ్య బాధ్యత అని అన్నారు. “అక్షర” కార్యక్రమం ద్వారా పుస్తకాలను సేకరించి ఆసక్తి ఉన్న విద్యార్థులకు అందజేస్తున్నామని తెలిపారు. విద్యార్థుల్లో స్ఫూర్తి నింపాలనే ఉద్దేశంతో తాను తరచూ పాఠశాలలను సందర్శిస్తున్నానని వెల్లడించారు. తొలుత వివిధ శాఖల అధికారులు తమ బాల్యంలో ఎదుర్కొన్న విద్యా సవాళ్లు, చదువులో సాధించిన విజయాలు, ప్రస్తుతం అందిస్తున్న సేవలపై తమ అనుభవాలను సభాముఖంగా పంచుకున్నారు. కార్యక్రమం ముగింపులో వివిధ శాఖల అధికారుల ఉత్తమ పనితీరును గుర్తిస్తూ మెమెంటోలు మరియు ప్రశంసాపత్రాలు అందజేశారు. వీరిలో భీమవరం ఆర్డీవో కె. ప్రవీణ్ కుమార్ రెడ్డి, నర్సాపురం ఆర్డీవో దాసి రాజు, డీఈవో ఇ.నారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, పిజీఆర్ఎస్ నోడల్ అధికారి వై.దొసిరెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎన్.వి అరుణకుమారి, జిల్లా వెనుకబడిదల సంక్షేమ శాఖ అధికారి ఎ.వి సూరిబాబు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, జిల్లా ఆర్ అండ్ అధికారి శ్రీనివాసరావు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డిఎం ఇబ్రహీం, డిసిహెచ్ఎస్ పి.సూర్యనారాయణ, మత్స్య శాఖ ఏడి ఎల్ ఎల్ ఎన్ రాజు, జిల్లా దివ్యంగుల సంక్షేమ శాఖ అధికారి రామ్ కుమార్, ఈ డివిజన్ మేనేజర్ ఎం.కిరణ్ కుమార్, కలెక్టరేట్ డిటి ఎం.సన్యాసిరావు, ఇరగవరం ఎంపీడీవో శ్రీనివాసరావు, గణపవరం డిప్యూటీ ఎంపీడీవో పివి సత్యనారాయణ, నరసాపురం మండలం లిఖితపూడి గ్రామం పంచాయతీ సెక్రెటరీ శివ కళ్యాణి ఉన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.





# కవల కన్సల్టెన్సీ సహకారంతో క్యాంపస్ హైరింగ్ డ్రైవ్



**భీమవరం టౌన్, ఏప్రిల్ 21 : ప్రభాతవార్త**
స్థానిక కె.జి.ఆర్.ఎల్ కాళాశాలలో ఇన్ఫోహైవ్ సంస్థ ఆధ్వర్యంలో, కవల కన్సల్టెన్సీ సహకారంతో మంగళవారం క్యాంపస్ హైరింగ్ డ్రైవ్ నిర్వహించారు. వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు.ఈ డ్రైవ్ ద్వారా విద్యార్థులకు వివిధ ఐటి మరియు నాన్-ఐటి రంగాల్లో 48 మంది డిగ్రీ, పీజీ, ఫార్మసీ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభించాయి. సంస్థ ప్రతినిధులు విద్యార్థుల నైపుణ్యాలను పరీక్షించి, అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు , సెక్రటరీ ఢ కరెస్పాండెంట్ మెంటే రామనోహర్,ట్రెజరర్ గన్నాబత్తుల శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యార్థులకు మంచి కెరీర్ అవకాశాలు అందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. విద్యా ర్థులు తమ ప్రతిభను ప్రదర్శించి, మంచి సంస్థల్లో ఉద్యోగాలు పొందాలని సూచిం చారు. కె జి ఆర్ ఎల్ ఫార్మసీ డైరెక్టర్ డాక్టర్ కవల నాగేశ్వరరావు , ప్రిన్సిపాల్ డాక్టర్ డి .రాఘవ ,పీజీ కోర్సెస్ డైరెక్టర్ డాక్టర్ తోట రామమూర్తి , డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రమూర్తి ,ఐజాక్ బాబు ,ఎడ్వర్డ్ , కథిజ , శ్వేత పాల్గొన్నారు .కళాశాల అధ్యా పకులు, ప్లేస్మెంట్ సెల్ సభ్యులు, మరియు విద్యార్థులు పాల్గొన్నారు. అందరి సహకా రంతో కార్యక్రమం విజయవంతం అయినట్లు ఫార్మసీ డైరెక్టర్ డాక్టర్ కవల నాగేశ్వ రరావు వెల్లడించారు.

# గోవధను సహించం : బీజేపీ నేత ఆవేదన



**భీమడోలు, ఏప్రిల్ 21 ప్రభాతవార్త** : ఏలూరు జిల్లా భీమడోలు లో గో అతను అడ్డుకున్న బిజెపి నాయకులు, తమ ప్రాణాలు పోయినా పర్లేదు, గోవధ చేస్తే సహించమని భీమడోలు బీజేపీ నాయకులు ప్రవీణ్ పటేల్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం భీమడోలు సంతమార్కెట్ కబేళా సమీపంలో ఆవు, ఆవుదూడ కోతకు సిద్ధంగా ఉందన్న సమాచారంతో హుటాహుటిన వెళ్లిన బీజేపీ నాయకులకు కత్తితో నరకబోతున్న స్థితిలో అచేతనంగా ఉన్న ఆవు, ఆవుదూడ కనిపించాయి. వెంటనే దుండగుల నుంచి వాటిని సంరక్షించి గోశాలకు తరలించే ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ పటేల్, తవ్వా చినబాబు మీడియాతో మాట్లాడుతూ గోవధపై నిషేధం ఉన్నప్పటికీ ఇలా గోవులను వధించడం తమను బాధిస్తున్నదని తెలిపారు. అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని, పోలీసులు వీరికి అవగాహన కల్పిస్తూ కౌన్సిలింగ్ ఇవ్వాలని కోరారు. హిందువులకు పుట్టుక నుంచి చావు వరకు అన్నింటిలో గోమాత ప్రమేయం ఉంటుందని అలాంటి అమ్మవంటి ఆవులను వాదించడం కలిచి వేస్తుందని నాయకులు ప్రవీణ్ పటేల్, చినబాబు ఆవేదన వ్యక్తం చేసారు.

# చెరువులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిదీ

## తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ



**తణుకు, ఏప్రిల్ 21 ( ప్రభాత వార్త)** తణుకు నియోజకవర్గంలోని చెరువులను పరిక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిదీ అని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ‘జలధార--జలహారతి’ పథకంలో భాగంగా నీటి సాగు -- నీటి భద్రత కార్యక్రమంలో ఎమ్మెల్యే రాధాకృష్ణ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక కూటమి కార్యాలయంలో అత్తిలి, ఇరగవరం, తణుకు మండలాల నీటి సాగు -- నీటి భద్రత మండల కమిటీ సభ్యులతో గ్రామ స్థాయిలో గుర్తించిన పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే రాధాకృష్ణ మాట్లాడుతూ అత్తిలి, ఇరగవరం, తణుకు మండలాలలో గుర్తించిన కెనాల్, డ్రైన్స్ పనులను మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అంచనాలు ప్రతిపాదించాలన్నారు. ఉపాధి కూలీలతో ‘జల ధార -- జల హారతి’ 100 రోజుల కార్యక్రమం ద్వారా పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో ఉన్న చెరువుల పూర్తి వివరాలు తెలుసుకొని ప్రస్తుతం పూడికతీత పనులు చేపట్టుటకు అనుగుణంగా ఉన్నవాటిని గుర్తించాలన్నారు. ఈ ‘జల ధార జల హారతి’ 100 రోజుల కార్యక్రమము ద్వారా పనులు పూర్తిచేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని చెరువుల భౌతిక పరిస్థితులను వారం రోజులలో నివేదిక సమర్పించాలని కోరారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో జులై 2026 నుండి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గుర్తించి అన్ని రకాల ప్లాంటేషన్ పనులకు ఇప్పటినుండే పూర్తి స్థాయిలో గ్రామాలలో అవసరమగు పనులను గుర్తించి ప్రతిపాదనలు తయారు చేయవలసినదిగా ఆదేశించియున్నారు. సదరు సమావేశమునకు అత్తిలి, ఇరగవరం, తణుకు మండలాల మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, నీటి సాగు -- నీటి భద్రత మండల స్థాయి కమిటీ సభ్యులు, ఎన్ఆర్జీఎస్ సిబ్బంది, ఇరిగేషన్ సిబ్బంది హాజరయ్యారు.

# స్వచ్ఛ తణుకు నియోజకవర్గం ఏర్పాటు దిశగా ప్రణాళికలు

- **రూ. 4 కోట్లు వ్యయంతో ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు సన్నాహాలు**
- **స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం**



**తణుకు, ఏప్రిల్ 21 ( ప్రభాత వార్త)** రాబోయే రోజుల్లో స్వచ్ఛ తణుకు నియోజకవర్గం ఏర్పాటు దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. మంగళవారం తణుకు విచ్చేసిన పట్టాభిరామ్ స్వర్ణాంధ్ర స్వచ్ఛందర ద్వారా చేపట్టిన వివిధ ప్రాజెక్టులను ఆయన పరిశీలించి మాట్లాడారు. గత ప్రభుత్వం బదిలీ వెళ్ళిన లక్షలాది టన్నుల కూటమి ప్రభుత్వం తొలగిస్తుందని చెప్పారు. తణుకు పట్టణంలో రూ. 4 కోట్ల వ్యయంతో ఎమ్మెల్యే రాధాకృష్ణ సహకారంతో రెండు ఎకరాల స్థలంలో ప్రాసెసింగ్ యూనిట్ త్వరలో ప్రారంభించినట్లు తెలిపారు. తణుకు పట్టణంలో డంపింగ్ యార్డు లేకుండా స్వచ్ఛాంధ్ర ప్రాసెసింగ్ సెంటర్ ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏ రోజు చెత్త ఆరోజు ప్రాసెస్ చేసే విధంగా చర్యలు చేపడతామన్నారు. చెత్త నుంచి ఉత్పత్తి అయ్యే కంపోస్టు మార్క్ ఫెడ్ ద్వారా మార్కెటింగ్ చేసి పది శాతం ఆదాయాన్ని తణుకు మున్సిపాలిటీకి దక్కే విధంగా ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం అత్తిలి, ఇరగవరం,లతణుకు మండలాల పరిధిలో రూ. 9.60 కోట్లు వ్యయంతో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా తోపుడు బళ్ళు, మూడు చక్రాల వాహనాలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టామని అన్నారు. అత్తిలి మండలంలో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్ ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టామని అన్నారు. అర్బన్, రూరల్ ప్రాంతాల్లో డోర్ టు డోర్ కలెక్షన్ మెరుగుపరిచేందుకు ప్రణాళికలు మరింత మెరుగుగా చేపట్టినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో ఎలక్ట్రిక్ వాహనాలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. గతంలో స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తణుకు పట్టణాన్ని సందర్శించడంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# జెఇఇ మెయిన్లో తణుకు తిరుమల విద్యాసంస్థల ప్రభంజనం



**తణుకు, ఏప్రిల్ 21 (ప్రభాతవార్త) :** కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించిన జెఇఇ మెయిన్ పరీక్షల్లో తణుకులో తమ తిరుమల ఐఐటి మరియు మెడికల్ అకాడమి విద్యార్థులు ఎస్. లోకేష్ వినయ్ 99.7, బి. మౌర్య సంతోష్ కుమార్ 99.67, ఎస్. చాణక్య 99.19, కె. హేమాన్య లక్ష్మి 99.13, టి. జశ్వంత్ 99.08 పర్సంటైల్ సాధించారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలియజేశారు. 99 పర్సంటైల్ పైన 5 గురు, 98 పర్సంటైల్ పైన 11 మంది, 97 పర్సంటైల్ పైన 15 మంది, 96 పర్సంటైల్ పైన 24 మంది, 95 పర్సంటైల్ పైన 30 మంది, 90 పర్సంటైల్ పైన 54 మంది సాధించారని తెలియజేశారు. ఈ సంవత్సరం ఈ క్యాంపస్ నుండి 85 మంది అడ్వాన్స్ పరీక్షలకు అర్హత సాధించారని మరియు సుమారు 35 మంది పైగా ప్రతిష్ఠాత్మకమైన వివిధ ఐఐటీ , నిట్ లలో సీట్లు పొందగలరని తెలిపారు. ఈ విజయం సాధించిన విద్యార్థినీ విద్యార్థులను, అధ్యాపక అధ్యాపకేతర బృందాన్ని డైరెక్టర్ సరోజిని దేవి మరియు అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్ బాబు లతో కలిసి అభినందించారు.

# పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు



**ద్వారకాతిరుమల, ఏప్రిల్ 21 (ప్రభాతవార్త):** ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమలలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజలను గోపాలపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ దొడ్డిగర్ల సువర్ణ రాజు ఆధ్వర్యంలో నిర్వహించగా, గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకుని మళ్లీ ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. పూజల అనంతరం భక్తులు తొలిమెట్టు వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకుడు తరగల శ్రీనివాస్, వీర మహిళలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ముఖ్యంగా యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకొని తనదైన శైలిలో అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకు తీసుకెళ్లాలని, శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నామని వారు తెలిపారు. ఇటీవల పవన్ కళ్యాణ్‌కు శస్త్ర చికిత్స జరిగిన విషయం తెలిసిందే.

# బాబు జగ్జీవన్ రామ్ యూత్ సభ్యుల ఔదార్యం




**టీ నర్సాపురం ఏప్రిల్ 21 ప్రభాతవార్త** టీ నర్సాపురం గ్రామానికి చెందిన బాబు జగ్జీవన్ రామ్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధితో ఇబ్బంది పడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుని ఆదుకున్నారు. చింతలపూడి మండలం ఆంథోనీ నగర్ కు చెందిన పన్నెండు సంవత్సరాల బాలుడు నందిపాం రోనిత్ కు మానవతా దృక్పథంతో వైద్య చికిత్స కొరకు పదమూడు వేల రూపాయలు కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేసి తమ ఔదార్యం చాటుకున్నారు .ఈ సందర్భంగా మండల యూత్ సభ్యులు నందిపాం రవి మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో గ్రామంలో గత ఐదు సంవత్సరాల నుండి తమ శక్తి మేరకు సామాజిక దృక్పథంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ కష్టాల్లో ఉన్న తోటి వారికి ఆర్థిక సహాయాన్ని అందిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. చక్కని భవిష్యత్తు ఉన్న రోనిత్ ప్రాణాంతక వ్యాధికి గురవటం తమను ఎంతగానో కలచివేసిందని అన్నారు. బాలుడు త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అద్దేపల్లి రవి, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఇన్‌టర్న్‌షిప్ సర్టిఫికెట్స్ ప్రదానం



**పెనుమంట్ర, ఏప్రిల్ 21, (ప్రభాతవార్త)** మండలంలోని మార్టేరు పీఎంశ్రీ ఎస్ వి జి ఉన్నత పాఠశాలలో మంగళవారం ఇన్ టర్న్ షిప్ సర్టిఫికెట్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించి ఎలక్ట్రీషియన్ బ్యాంకింగ్ విభాగాల్లో శిక్షణ పూర్తి చేసిన పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయిని బి. త్రివేణి చేతుల మీదుగా ప్రదానం చేయడం జరిగింది . ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు త్రివేణి మాట్లాడుతూ పిఎంశ్రీ పాఠశాలలు అందిస్తున్న ఒకేషనల్ కోర్సులు విద్యార్థుల పాలిట వరం అని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన స్థానిక బసంతిదేవి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ.నగేష్ మాట్లాడుతూ ఒకేషనల్ కోర్సుల వల్ల సాధారణ విద్యతో పాటు జీవనోపాధి కలిగించే వృత్తి నైపుణ్యాలు కూడా అందుతాయని తెలియజేశారు. పాఠశాల ఒకేషనల్ ఉపాధ్యాయులు పి.లతా స్పందన, సిహెచ్.కుశలత, చందులు ఇంటర్న్ షిప్ పూర్తిచేసిన విద్యార్థులను, శిక్షణకు విద్యార్థులను పంపిన తల్లిదండ్రులను అభినందించినారు. అనంతరం సమగ్ర శిక్ష వారు అందించిన టి షర్ట్ లు, టూల్ కిట్లను విద్యార్థులకు అందించారు. తమ పిల్లలు వృత్తివిద్యా నైపుణ్యాలు నేర్చుకుని ప్రదర్శించడం తమకు ఆశ్చర్యాన్ని కలిగించిందని దీనికి కారణమైన పాఠశాల ఉపాధ్యాయులకు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హిందీ పండిట్ సిహెచ్ వెంకట నరేంద్ర, కే నరసింహారెడ్డి, సిహెచ్ జ్యోతిబాస్, ఏ వెంకట్రావు, సిహెచ్ లక్ష్మి శైలజ, పి.శారదా దేవి, ఏ.సతీష్ రెడ్డి, జిఎస్ఎస్ ప్రసాద్ రెడ్డి, కే.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# కిడ్నీ బాధితుడికి రూ.1.84 లక్షల ఆర్థిక సాయం



**జంగారెడ్డిగూడెం ప్రభాతవార్త ఏప్రిల్ 21** జంగారెడ్డిగూడెం స్థానిక మారుతీ నగర్‌కు చెందిన ప్రగడ హర్షిత్ కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స కోసం అల్లూరి సీతారామరాజు మున్సిపల్ పార్క్ కుటుంబ సభ్యులు భారీ ఆర్థిక సాయం అందించారు. సంఘ సేవకురాలు గొర్రెల గంగ–నరసింహారావు దంపతుల పిలుపు మేరకు సేకరించిన రూ. 1,84,000లను మంగళవారం బాధితుడి తండ్రికి అందజేశారు. ఈ మొత్తంలో గొర్రెల గంగ కుమార్తె లావణ్య అమెరికాలో తన స్నేహితుల ద్వారా సేకరించిన రూ.1.47 లక్షలు కూడా ఉన్నాయి. గోరింట విజయరామరాజు, ముదునూరి నరసింహరాజు, బోడా సత్యనారాయణ తదితరుల చేతుల మీదుగా చెక్కును అందజేస్తూ, హర్షిత్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో మున్సిపల్ కార్మికుడు సురేష్ మృతి



**జంగారెడ్డిగూడెం ప్రభాతవార్త ఏప్రిల్ 21** జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలో శానిటేషన్ పబ్లిక్ హెల్త్ వర్కర్‌గా పనిచేస్తున్న పితాని సురేష్ (55) మంగళవారం ఉదయం విధి నిర్వహణలో ఉండగా గుండెపోటుతో మరణించారు డ్యూటీలో ఉండగానే అకస్మాత్తుగా గుండెనొప్పి రావడంతో ఆయన అక్కడికక్కడే కన్నుమూశారు. ?సమాచారం అందుకున్న మున్సిపల్ కమిషనర్ కే వెంకటరమణ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు పోస్టుమార్టం అయినా అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అందజేసారు విధి నిర్వహణలో ఉన్న కార్మికుడు మృతి చెందడం పట్ల మున్సిపల్ సిబ్బంది మరియు పలువురు పెద్దలు.సంతాపం వ్యక్తం చేశారు



# కేజీఆర్ఎల్ కాలేజ్‌లో విజయవంతం గా జాబ్ మేళా



**భీమవరం ఏప్రిల్ 21 ప్రభాతవార్త** భీమవరం ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో, ఇన్ఫో హైవ్ సొల్యూషన్స్ సంస్థ నిర్వహణలో, కవల కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో మంగళవారం కేజీఆర్ఎల్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ వేదికగా జాబ్ మేళా విజయవంతంగా నిర్వహించబడింది. ఈ జాబ్ మేళాలో సుమారు 100 మంది అభ్యర్థులు పాల్గొని ఇన్ఫో హైవ్ సొల్యూషన్స్ సంస్థ ప్రతినిధులతో ఇంటర్వ్యూలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు మరియు యువతకు ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించడమే కాకుండా, వారికి నేరుగా ఉద్యోగ అవకాశాలు పొందే అవకాశం లభించింది. ఈ సందర్భంగా కవల కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ మరియు మేనేజింగ్ డైరెక్టర్ మరియు కళాశాల డైరెక్టర్ అయిన డాక్టర్ కవల నాగేశ్వరరావు మాట్లాడుతూ, విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకుని ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే భవిష్యత్తులో కూడా ఇలాంటి జాబ్ మేళాలను మరింతగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ, విద్యార్థుల కెరీర్ అభివృద్ధి కోసం ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఇన్ఫో హైవ్ సొల్యూషన్స్ ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమం విజయవంతంగా సాగడంపై సంతోషం వ్యక్తం చేశారు మరియు ఫలితాలు 3 రోజుల్లో ప్రకటించబడతాయి అని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది వివిధ కళాశాల విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

# మహిళల రక్షణతో పాటు నేర నియంత్రణే లక్ష్యం

## నూజివీడు సీఐ రామకృష్ణ



**చాట్రాయి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త** సమాజంలో మహిళల రక్షణతో పాటు నేరాలు నియంత్రించాలని లక్ష్యంతో పోలీసు యంత్రాంగం పనిచేస్తుందని నూజివీడు సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ అన్నారు. జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, నూజివీడు డీఎస్పీ కె.వి.వి.ఎన్.వి. ప్రసాద్ ఆదేశాలపై చాట్రాయి వెలుగు కార్యాలయ ప్రాంగణంలో నూజివీడు రూరల్ సీఐ కె. రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్య క్రమంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా మహిళ పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. మహిళా సంరక్షణ శక్తి టీమ్స్ మహిళలు మరియు విద్యార్థినుల భద్రత కోసం ఏర్పాటు చేసిన శక్తి టీమ్స్ ప్రాధాన్యతను వివరించారు. మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, వేధింపులకు గురైతే భయం వీడి పోలీసులను ఆశ్రయించాలని కోరారు. ఆన్‌లైన్ మోసాలు, ఓటిపి మరియు బ్యాంక్ వివరాలు ఇతరులకు చెప్పడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 కి ఫోన్ చేయాలని సూచించారు. వేసవి కాలంలో ప్రజలు ఊర్లకు వెళ్లే టప్పుడు ఇళ్లకు పటిష్ట మైన తాళాలు వేయాలని, విలువైన వస్తువుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారం డయల్ 112 కు అందించాలని కోరారు. గ్రామాల్లో మరియు వ్యాపార సంస్థల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాలను అరి కట్టవచ్చని, ఇది మూడవ కన్నులా పనిచేస్తుందని వివరించారు. ద్విచక్ర వాహన దారులు ప్రయాణించే సమయంలో తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ లేని పక్షంలో చట్ట ప్రకారం కేసులు నమోదు చేయడమే కాకుండా భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ప్రజల సహకారం తోనే నేరరహిత సమాజాన్ని నిర్మించ గలమని, ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో చాట్రాయి ఎస్సై రామకృష్ణ, మండల అధికారులు, పోలీస్ సిబ్బంది, మహిళలు మరియు స్థానిక యువత పాల్గొన్నారు.

## స్థానిక సంస్థలు ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపునకు

# వివోఏలు బాధ్యత తీసుకోవాలి



**జీలుగుమిల్లి ఏప్రిల్ 21, (ప్రభాతవార్త)** రానున్న స్థానిక సంస్థలు ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపుకు వివోఏలు బాధ్యత తీసుకోవాలని పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు స్పష్టం చేశారు. మంగళవారం బర్రింకలపాడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డ్వాక్రా సంఘాల సహాయకులు (వివోఏ)లకు 374 ఆధునిక 5జీ స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేయడంతో పాటు, ప్రధానమంత్రి అనుసూచిత జాతి అభ్యుదయ యోజన (పిఎంఏ జేఏవై ) లో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివోఏలు గ్రామస్థాయిలో ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసే కీలక భూమిక పోషిస్తున్నారని, వారి పనితీరును మరింత సమర్థవంతం చేయడానికి టెక్నాలజీ వినియోగం అవసరమని పేర్కొన్నారు. 5జీ స్మార్ట్‌ఫోన్ల ద్వారా వివోఏలు త్వరితగతిన సమాచారం పంచుకోవడంతో పాటు, పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పెరుగుతుందని తెలిపారు.

**సొంత నిధులతో వివోఏలకు భీమా:-**

అదే విధంగా, వివోఏల సంక్షేమం దృష్ట్యా కేవలం రూ.400 ప్రీమియంతో రూ.5 లక్షల ఆరోగ్య బీమా సదుపాయం కల్పించేలా వ్యక్తిగతంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బాలరాజు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము, అడపా నాగరాజు, మెట్ట బుచ్చిరాజు, ములిశెట్టి యుగంధర్, తోట రవి, గుణపర్తి చిన్ని, టిడిపి మండల అధ్యక్షులు సుంకపల్లి సాయి, గ్రీనరీ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ పాదం కృష్ణ, కూటమి నాయకులు కొణతాల ప్రసాద్, దుగ్గిన శ్రీనివాస్, మాదేపల్లి శ్రీనివాస్, తమ్మన సాంబ, ఉండవల్లి కిరణ్, వెలుగు ఏపీఎంలు పాల్గొన్నారు.



# శ్రీ ఆది శంకరాచార్యులు జయంతి

**మొగల్తూరు ఏప్రిల్ 21(ప్రభాతవార్త)** పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం కాళీపట్నం వెస్ట్ గ్రామ పంచాయతీ పరిధి పల్లవపాలెం సమీపంలో ఉన్న శివాలయంలో శ్రీ ఆది శంకరాచార్యల జయంతి కార్యక్రమం కోడి సత్యనారాయణ కోడి రామ తులసి మండల మహిళా కన్వీనర్ మరియు సమర సత్తా సేవ ఆధ్వర్యంలో మంగళవారం జరిగినది, ఈ సందర్భంగాఖశీడ సంయోజకులు తమ్మా వెంకట రమణ మూర్తి మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు శ్రీ శంకరాచార్యులు చేసిన విషయాలను ప్రస్తావించారు. హిందూ ధర్మము పట్ల భగవంతుని పట్ల భక్తి విశ్వాసాలు సన్నగిల్లుతున్న సమయంలో శంకరాచార్యులు రచించినటువంటి రచనలు చెప్పినటువంటి మాటలు హిందూ ధర్మాన్ని హిందూ బంధువులను సంఘటిత పరచడానికి ఎంతగానో ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు. బాలదారి నాగశ్రీ మండల మహిళా సహ కన్వీనర్ కోపనాథి రుష్యేంద్రరావు ఖండ ధర్మ ప్రచారకులు మరికొందరు సభ్యులు కలిసి భజ గోవింద శ్లోకాలను ఆలపించారు.

# వైభవంగా శ్రీ గుడ్ల గురవమ్మ అమ్మవారి వార్షికోత్సవాలు



**కామవరపుకోట,ఏప్రిల్ 21(ప్రభాతవార్త):** పాతూరు వాలీసుగ్రీవుల గట్టు సమీపంలో వెలసిన శ్రీ గుడ్ల గురవమ్మ అమ్మవారి 11వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ ఆలయ పునఃప్రతిష్ట 2015లో జరగగా, నాటి నుండి ప్రతి ఏటా రెండు రోజుల పాటు ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం అమ్మవారికి విశేష అభిషేకాలు, మహిళలతో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించిన అనంతరం, గ్రామోత్సవాన్ని కన్నులపండువగా జరిపారు. బుధవారం ఉదయం ప్రత్యేక పూజలు, అర్చనలు ఉంటాయని, ఉదయం 11 గంటల నుండి అఖండ అన్నసమారాధన ప్రారంభమవుతుందని ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు.

## ద్వారకాతిరుమలలో రూ.50 లక్షల

# గోవర్ధన్ ప్లాంట్ ప్రారంభం



**ద్వారకాతిరుమల,ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** ద్వారకాతిరుమలలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించిన ఏపీ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మంగళవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో వి త్రినాధరావు, ఇతర అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. వేదపండితులు అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం వేదాశీర్వచనం మండపంలో ఆశీర్వచనం అందజేశారు. ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, ఏపీ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ యండి బి.అనిల్ కుమార్ రెడ్డి, డైరెక్టర్ కూచిపూడి ఉదయభాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో రూ.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన గోబర్ధన్ ప్లాంట్‌ను చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో ప్లాస్టిక్ రహిత వాతావరణం, వ్యర్థాల నుంచి సంపద సృష్టి లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ద్వారకాతిరుమల ఆలయంలో ఏర్పాటైన గోబర్ధన్ ప్లాంట్ ద్వారా సేంద్రియ వ్యర్థాలను శాస్త్రీయంగా శుద్ధి చేసి బయోగ్యాస్, సేంద్రియ ఎరువులుగా మారుస్తామని చెప్పారు. దీని ద్వారా కాలుష్యం తగ్గడంతో పాటు శుభ్రమైన శక్తి ఉత్పత్తి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ స్థానికంగా ఉపాధి అవకాశాలు పెంచి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి దోహదపడుతుందని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్షల మేరకు స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాల సాధనలో భాగంగా ఇలాంటి గ్రీన్ కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ గోబర్ధన్ ప్లాంట్ ద్వారా వ్యర్థాలను సమర్థవంతంగా వినియోగించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుందని, స్థానికంగా శుభ్రత మెరుగుపడుతుందని తెలిపారు. పునర్వినియోగ శక్తి ఉత్పత్తికి ఇది దోహదపడుతుందని, గ్రామీణ అభివృద్ధికి ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ అధికారులు, ఆలయ అధికారులు, జిల్లా అధికారులు, వేదపండితులు, గోపాలపురం జనసేన పార్టీ ఇంచార్జ్ దొడ్డిగర్ల సువర్ణరాజు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిష్కరించండి



**అత్తిలి,ఏప్రిల్ 21( ప్రభాతవార్త)** మండుటెండలో కష్టపడి పనిచేస్తున్న కూలీలకు పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బళ్ళ చిన వీరభద్ర రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అత్తిలి మండల కేంద్రంలో పని చేస్తున్న కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనేక మంది కూలీలు మాట్లాడుతూ ఉదయం 6 గంటలకే పనికి వచ్చి మొదటి ఫోటో తీసిన తర్వాత పని చేయడానికి దాదాపు మూడు, నాలుగు కిలో మీటర్ల దూరం నడిచి వెళ్లి తిరిగి మండుటెండలో మొదటి ఫోటో తీసిన ప్రదేశానికి వచ్చి రెండవ ఫోటో దిగి ఇంటికి వెళ్ళవలసి వస్తోందని తెలిపారు. ఒకో సమయంలో సిగ్నల్ లేక ఫోన్లు పనిచేయకపోవడంతో మరింత సమయం ఆలస్యం అవుతుందని చెప్పారు. వీరభద్ర రావు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 20న విజయవాడలో కమిషనర్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నా సందర్భంగా ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న వేతన బకాయిలు వెంటనే చెల్లిస్తామని, ఫేస్ యాప్, రెండు పూటలా ఫోటో మాస్టర్ విధానం రద్దు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. క్షేతిస్థాయిలో వెంటనే అమలు జరిపేందుకు జిల్లా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యురాలు బొక్క దుర్గ భవాని, గుత్తుల హేమ, బొంతు సీతమ్మ, చేబ్రోలు వెంకటలక్ష్మి, జక్కం శెట్టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## గణపవరం ఎంఈఓ 1 గా ప్రకాష్



**అత్తిలి/ గణపవరం ఏప్రిల్ 21( ప్రభాతవార్త )** అత్తిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న ఏ సి వి ప్రకాష్ గణపవరం మండలం విద్యా శాఖధికారి –1గా నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి ఇవివి నారాయణ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. గణపవరం లో బాధ్యతలు స్వీకరించిన ప్రకాష్ ను ప లువురు ఉపాధ్యాయులు,కార్యాలయ సిబ్బంది అభినందించారు.

# ఇరగవరం ఎంపీడీవోకు సత్కారం



**ఇరగవరం, ఏప్రిల్ 21 ( ప్రభాతవార్త )** భీమవరం లో నేషనల్ సివిల్స్ సర్వీసెస్ డే సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగరాణి చేతుల మీదుగా ఇరగవరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎ. శ్రీనివాసు అవార్డు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎ. శ్రీనివాసు ను ఇరగవరం మండల కూటమి నాయకులు,మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు, పంచాయతీ అభివృద్ధి అధికారులు,గ్రామ స్థాయి సిబ్బంది, స్వర్ణ గ్రామ సిబ్బంది అభినందించారు.

# పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు




**జంగారెడ్డిగూడెం ప్రభాతవార్త ఏప్రిల్ 21** జంగారెడ్డిగూడెం ఏపీ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆరోగ్యంగా కోలుకోవాలని కోరుతూ అఖిలభారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో ఇందిరానగర్ అభయాంజనేయ స్వామి ఆలయంలో తమలపాకుల పూజ నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు వలవల తాతాజీ, నియోజకవర్గ అధ్యక్షుడు ఉక్కుర్తి సీతారాం నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పోల్నాటి బాబ్జి, ఆర్యవైశ్య సంఘ నేత చిన్ని రామసత్యనారాయణ, జనసేన మండల అధ్యక్షుడు ఆకుల రాకేష్, చింతల నాని తదితరులు పాల్గొన్నారు. పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఈ సందర్భంగా వారు ప్రార్థించారు. కార్యక్రమంలో చిరంజీవి యువత సభ్యులు, జనసేన కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ ఆరోగ్యం మెరుగుపడాలని ప్రత్యేక పూజలు



**మొగల్తూరు ఏప్రిల్ 21(ప్రభాతవార్త)** పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం కేపీ పాలెం గ్రామంలో వెలసి ఉన్న శ్రీ భక్తాంజనేయ స్వామి వారి ఆలయం నందు మంగళవారం జనసేన నాయకులు కుమ్మరి పురుగు రాంబాబు, కోట్ల నెహ్రూ ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆరోగ్యం మెరుగుపడాలని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు స్థానికులు గ్రామస్తులు వీర మహిళలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు,

# విద్యార్థినులకు నగదు బహుమతి



**మొగల్తూరు ఏప్రిల్ 21 (ప్రభాతవార్త)** పశ్చిమగోదావరి జిల్లాశ్రీ చైతన్యజూనియర్ కాలేజ్, చిన అమిరం , భీమవరం లో చదువుచున్న ఎంపీసీ మరియు బైపిసి ద్వితీయ సంవత్సరం విద్యార్థుల ఆర్థిక సహకారం మరియు కాలేజీ యాజమాన్యం సౌజన్యంతో మంగళవారం మొగల్తూరు మండలం కేపీ పాలెం గ్రామం నందు హై స్కూల్ ప్లస్ లో ఇంటర్మీడియట్ చదువుతున్న పేద విద్యార్థులకు 21వేల నగదుని కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీమతి పి.ఇందిర గారి చేతుల మీదుగా విద్యార్థినులు గన్నాబత్తుల అనితకు రూ. 5500, తిరుమాని ప్రమీలకు రూ. 5500, మొదటి సంవత్సరం 418/500 మార్కులతో కాలేజీ మొదటి ర్యాంకు సాధించినటువంటి పత్రి అనుకు రూ. 10,000 ప్రోత్సాహంగా శ్రీ చైతన్య కాలేజీ అధ్యాపకులు అందచేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీమతి ఇందిర గారు మాట్లాడుతూ చైతన్య కాలేజీ విద్యార్థులను సిబ్బందిని అభినందించారు.ఈ కార్యక్రమంలో కెపి పాలెం హైస్కూల్ ప్లస్ అధ్యాపక ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు